సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం ౹ 25 ౹ నవంబర్ ౹ 2024



కనులపండువగా కార్తీక దీపోత్సవం

వేములవాడ: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం రాజన్న సన్నిధిలో రంగురంగుల పూలతో లింగాకారంలో పేర్చి మధ్యలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఓపెన్ స్లాబ్‌లో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సంగీత దర్శకుడు, నంది అవార్డు గ్రహీత కె.లక్ష్మణ్‌సాయి పాల్గొన్నారు. ఈవో వినోద్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'ప్రాథమిక' వైద్యం అంతంతే !

- జిల్లా ఆస్పత్రిలోనే డెలివరీలు
- వైద్యసిబ్బందిలో నిర్లక్ష్యం
- నీరుగారుతున్న కలెక్టర్ లక్ష్యం
- ప్రైవేట్‌కు వెళ్తూ దోపిడీకి గురవుతున్న జనం

జిల్లా సమాచారం	
జిల్లా ఆస్పత్రి	01
ప్రాంతీయ వైద్యశాల	01
కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు	02
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	13
అర్బన్ హెల్త్ సెంటర్లు	02



పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లా ఆస్పత్రుల్లోనే డెలివరీలు చేస్తుండగా పీహెచ్‌సీల్లో ప్రసూతి సేవలు అంతంతగానే అందుతున్నాయి. నిరుపేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తూ ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు.

24 గంటల ఆస్పత్రుల్లోనూ అంతే..

జిల్లాలోని 24 గంటల వైద్యసేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ కూడా గర్భిణులకు సరైన వైద్యం అందడం లేదని తెలుస్తోంది. కేవలం వైద్యపరీక్షలు చేయడం వరకే పీహెచ్‌సీలు విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఇక అర్బన్ హెల్త్‌సెంటర్లలో కూడా సాధారణ కాన్పులు జరగడం లేదు. గత ఐదు నెలల్లో చందుర్తిలో 4, గంభీరావుపేట సీహెచ్‌సీలో 5, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేటల్లో ఒక్కో నార్మల్ డెలివరీలు జరిగాయి. మిగతా పీహెచ్‌సీలలో అసలు డెలివరీలే కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పేరుకే పీహెచ్‌సీలు ఉన్నాయని ప్రజలు అంటున్నారు. ఇక వేములవాడ ప్రాంతీయ వైద్యశాలలో 420, జిల్లా ఆస్పత్రిలో 1,302 డెలివరీలు చేశారు. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది లక్ష్యానికి అనుగుణంగా శ్రమించినట్లు భావించవచ్చు. జిల్లాలో ఎక్స్‌పెక్టేషన్ డెలివరీ డేట్(ఈడీడీ) కేసులు ప్రస్తుతం 4,962 ఉన్నాయి.

సౌకర్యాలు కరువు

పోతుగల్ పీహెచ్‌సీని 1965లో నిర్మించారు. భవనం పాతబడింది. ఇన్‌వార్డు విభాగం దెబ్బతింది. తరచూ మరమ్మతులతో ఆపరేషన్ థియేటర్ సరిగా లేదు. ఇక్కడ ఇద్దరు రెగ్యులర్ వైద్యాధికారులు పనిచేయాల్సి ఉండగా, కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్ విధుల్లో ఉన్నారు. 24 గంటల ఆస్పత్రి అయినా రాత్రి వేళల్లో ఏఎన్ఎం మాత్రమే విధుల్లో ఉంటారు. సిబ్బంది లేక సాధారణ ప్రసవాలు చేయడం లేదు. కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేటకు సీహెచ్‌సీ మంజూరు చేయగా, భవనం నిర్మించలేదు. పీహెచ్‌సీలోనే సీహెచ్‌సీ నిర్వహిస్తున్నారు.

ప్రైవేటుకు పరుగులు

ఒక్కో డెలివరీకి రూ.30వేల నుంచి రూ.లక్ష బిల్లు వేసే ప్రైవేటు ఆస్పత్రులు జిల్లాలో ఉన్నాయి. గత ఐదు నెలల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,308 డెలివరీలు అయ్యాయి. ఒక్కో డెలివరీకి రూ.50వేలు బిల్లు వేసినా మొత్తం రూ.6.54కోట్లు ప్రజల నుంచి ప్రైవేటు యజమాన్యాలకు వెళ్లాయి. చాలా మంది గర్భిణులు పీహెచ్‌సీల్లో వైద్యం చేయించుకుంటుండగా.. డెలివరీ సమయానికి ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. కాగా కొంత మంది ప్రైవేట్ వైద్యులు అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినా ప్రజలు ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారు. పీహెచ్‌సీలను ఆధునీకరించి, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, డీజీవో వైద్యులు, సర్జన్లు, ఇతర సిబ్బందిని నియమిస్తే జిల్లా ఆస్పత్రి లాగే సేవలందిస్తాయనే భావన ఉంది.

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు చేయాలి



పేద, మధ్య తరగతి ప్రజలు ప్రసవాలకు అప్పు చేసి లక్షల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. గర్భిణులకు నెలనెలా వైద్యం అందించే పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు చేయాలి. అవసరమైతే ఆపరేషన్లు చేసి ఆదుకోవాలి.

– మెరుగు అంజాగౌడ్, ముస్తాబాద్

నార్మల్ డెలివరీలు చేయాలని చెప్పాం



పీహెచ్‌సీల్లో నార్మల్ డెలివరీలు చేసేలా వైద్యులు, సిబ్బందికి చెబుతున్నాం. చాలా వరకు జిల్లా ఆస్పత్రికి పంపిస్తున్నారు. పీహెచ్‌సీల్లోనే డెలివరీలు అయ్యేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వసంతరావు, జిల్లా వైద్యాధికారి

కన్నీటి కష్టాలు తీర్చండి సారూ..

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి
- సిరిసిల్ల పెద్దూర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసుల గోడు



వినతిపత్రం అందిస్తున్న పెద్దూర్ డబుల్‌బెడ్రూం కాలనీవాసులు

సిరిసిల్లటౌన్: డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో కన్నీటి కష్టాలు తీర్చాలని కోరుతూ సిరిసిల్ల శివారులోని పెద్దూరువాసులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మొరపెట్టుకున్నారు. ఆదివారం సంజయ్‌ను కలిశారు. తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా వసతులు లేవన్నారు. కాలనీలో 516 కుటుంబాలు ఉన్నాయని, బోర్లు ఉన్నా మోటార్లు లేక నీటికి గోసపడుతున్నట్లు తెలిపారు. తమ కాలనీకి మూడు మోటార్లు అందించి నీటికష్టాలు తీర్చాలని కోరారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రచ్చ రాహుల్, వి.అశోక్, శ్రీకాంత్, సురేష్‌నాయక్, మునిస్వామి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలో నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్‌షిప్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 989 మంది దరఖాస్తు చేసుకోగా 962 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జాతీయస్థాయిలో ఉపకార వేతనాలు అందుతాయని తెలిపారు.

న్యూస్‌రీల్

జ్యోతిబా పూలే ఆశయాలు సాధిద్దాం



ముస్తాబాద్(సిరిసిల్ల): సామాజిక విప్లవకారుడు జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పూలే దంపతుల విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూలే ఆశయాలు నెరవేరుస్తుందన్నారు. ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాంగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రణవేని లక్ష్మణ్, పర్శ హన్మాండ్లు, కోడి అంతయ్య, రెడ్డబోయిన గోపి, గజ్జెల రాజు, చొక్కాల రాము, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాణి, మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి పాల్గొన్నారు.

27న రాష్ట్రస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి తెలిపారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 27న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు 75 కిలోలలోపు, పురుషులు 85 కిలోలలోపు బరువు ఉండాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 94403 37004, 63094 00105లో సంప్రదించాలని తెలిపారు.

ప్రజారక్షణ పోలీసుల బాధ్యత



ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజారక్షణ పోలీసుల బాధ్యత అని, ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి కోరారు. ముస్తాబాద్ మండలం చీకోడులో ఆదివారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మొగిలి మాట్లాడుతూ ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే అపరిచిత మెస్సేజ్ లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఎస్సై గణేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



సిరిసిల్లటౌన్: బీడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ కోరారు. సిరిసిల్ల ఏఐటీయూసీ భవన్‌లో ఆదివారం బీడీవర్కర్స్ ఫెడరేషన్ జిల్లా రెండో మహాసభలు నిర్వహించారు. బాలరాజ్ మాట్లాడుతూ అర్హులైన పేద కార్మికులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేయాలని, కార్మికులకు కనీస పెన్షన్ రూ.6వేలు అందివ్వాలని, జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. బీడీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భోగ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, డిప్యూటీ కార్యదర్శి ముఖరమ్, జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



సిరిసిల్ల: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెహాన ఇఫ్రత్ జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. సామాజిక సేవా భావం అలవర్చుకోవాలన్నారు. కళాశాల పరిసరాల్లో చెత్తను శ్రమదానం చేసి తొలగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష పాల్గొన్నారు.

అధికారుల సమస్యలకు పరిష్కారం లభించేనా?!

- ఐదేళ్ల తర్వాత ఇదే మొదటి అధికారిక సమావేశం
- సంస్థ వ్యాప్తంగా 2,300 మంది అధికారుల ఎదురుచూపు
- నేడు కొత్తగూడెంలో అధికారులతో యాజమాన్యం భేటీ



సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: సింగరేణి అధికారుల సుదీర్ఘ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఐదేళ్ల పాటు అధికారుల స్ట్రక్చర్ సమావేశాలు లేక సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో చాలా మంది అధికారులు నిరాశ నిస్పృహలతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా అంతర్గత పదోన్నతులకు నిబంధనలు అడ్డంకి కావడంతో ఈసమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈక్రమంలో ఈనెల 25న కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో అధికారుల సమస్యలపై స్ట్రక్చర్ సమావేశం నిర్వహిస్తోంది. దీనిపై కథనం..

ఏళ్లుగా పెండింగ్‌లో సమస్యలు

సింగరేణి అధికారులు తమ సమస్యల పరిష్కారం కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ)కు అనుబంధంగా సింగరేణి అధికారుల సంఘం కొనసాగుతోంది. ఈక్రమంలో కొన్నేళ్లుగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఉన్న అధికారుల సంఘం నాయకులు తమ సమస్యలపై సరిగా స్పందించలేదని అసంతృప్తి మొదలైంది. ఈక్రమంలో నిర్వహించిన అధికారుల సంఘం ఎన్నికల్లో కొత్త నాయకత్వం బాధ్యత స్వీకరించింది. సీఎంఓఏఐ అధ్యక్షుడిగా లక్ష్మీపతిగౌడ్ ఎంపికయ్యారు. వీరితో పాటు పూర్తి స్థాయి కమిటీ తమ బాధ్యతలను స్వీకరించింది. అధికారుల సమస్యలను సీఎంఓఏఐ నాయకత్వం పలుదఫాలుగా యాజమాన్యం దృష్టికి తీసుకవస్తూనే ఉంది. ఇటీవల రామగుండం పర్యటనకు వచ్చిన సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డితో అధికారుల సంఘం నాయకులు భేటీ అయ్యారు. గోదావరిఖని ఇల్లెందు క్లబ్‌లో డైరెక్టర్‌తో సమావేశమై సమస్యల పరిష్కారం కోసం స్ట్రక్చర్ సమావేశానికి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నారు. ఈక్రమంలో సోమవారం అధికారుల సంఘం నాయకులతో యాజమాన్యం భేటీ కానుంది.

అంతర్గత పదోన్నతులే ప్రధాన ఎజెండా

సంస్థ వ్యాప్తంగా సింగరేణి అధికారులకు అంతర్గత పదోన్నతుల్లో అన్యాయం జరుగుతోంది. ఎక్స్‌టర్నల్ అధికారులకు పదోన్నతి కల్పిస్తున్నప్పటికీ అంతర్గతంగా పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతోంది. ఈవిషయంలో ఏడేళ్లుగా అధికారులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. అంతేకాకుండా ఫస్ట్‌క్లాస్ పాసైన అభ్యర్థుల విషయంలో కూడా అన్యాయం జరుగుతోంది.

నేడు స్ట్రక్చర్ సమావేశం

సింగరేణి అధికారుల నాయకత్వంతో యాజమాన్యం కొత్తగూడెంలో సోమవారం భేటీ కానుంది. ఈ సందర్భంగా అధికారుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘం నాయకులు సిద్ధమవుతున్నారు. చాలా ఏళ్ల తర్వాత సమావేశం నిర్వహిస్తుండటంతో సమస్యల పరిష్కారానికి మోక్షం లభిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- న్యాయబద్ధమైన పదోన్నతి పాలసీ అమలు చేయాలి.
- ఫీల్డ్‌లో పనిచేస్తున్న అధికారులకు సౌకర్యాలు ఆధునీకరించాలి.
- పారదర్శక బదిలీ పాలసీ అమలు చేయాలి.
- ఆసుపత్రి సౌకర్యాలు ఆధునీకరించాలి. రిటైర్డ్ అధికారులకు మెడికల్ కార్డు అందించాలి.
- ఓసీపీలో అధికారులకు ఏసీ వాహనాలు కేటాయించాలి.
- కోలిండియాలోని పదోన్నతి పాలసీ అమలు చేయాలి.
- ఫస్ట్‌క్లాస్ మేనేజర్ల విషయంలో ఇటీవల వచ్చిన సర్క్యులర్‌లో మార్పులు చేయాలి.
- సీడీఏ రూల్స్‌లో నిబంధనలు సడలించాలి.
- ఎంక్వైరీ సమయంలో రావాల్సిన బెనిఫిట్స్ ఆపవద్దు.
- కోలిండియా ప్రకారం డిజిగ్నేషన్స్ కేటాయించాలి.
- అధికారులకు ఉచిత విద్యుత్, ఐఐటీ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి.

సమస్యలపై దృష్టిసారించాం

సింగరేణి అధికారుల సమస్యలపై చర్చించేందుకు స్ట్రక్చర్ సమావేశానికి అంగీకరించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు. ఐదేళ్ల తర్వాత మొదటిసారిగా జరిగే ఈ సమావేశంలో పదోన్నతులపై ప్రధానంగా దృష్టిసారించాం. అంతర్గత పదోన్నతుల విషయంలో అన్యాయం జరిగింది. చాలా మంది అధికారులు ఈవిషయంలో అసంతృప్తిగా ఉన్నారు. దీన్నే ప్రధాన ఎజెండాగా పెట్టాం. తాము గెలిచిన తర్వాత మొదటిసారిగా జరిగే స్ట్రక్చర్ సమావేశంలో అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యల పరిష్కారంలో రాజీలేకుండా ముందుకు సాగుతాం.

– లక్ష్మీపతిగౌడ్, అధికారుల సంఘం అధ్యక్షుడు, సింగరేణి

న్యాయసేవలు మరింత చేరువ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత
- వేములవాడ కోర్టులో ఈ–సేవ కేంద్రం ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి



వేములవాడ కోర్టులో ఈ–సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి ప్రేమలత

వేములవాడ: జిల్లా ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువయ్యాయని జిల్లా జడ్జి ప్రేమలత పేర్కొన్నారు. వేములవాడ కోర్ట్ కాంప్లెక్స్‌లో ఈ–సేవ కేంద్రాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పామిడిగంటం నరసింహ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి, రాధిక జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, ఏజీపీ పుప్పాల భానుకృష్ణ హాజరయ్యారు. ఈ–సేవ కేంద్రం ద్వారా కేసు స్థితిగతులు, తదుపరి విచారణ తేదీ సంబంధిత విచారణలు స్వీకరించడం, సర్టిఫైడ్ కాపీలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ, హార్డ్‌కాపీ పిటిషన్ల స్కానింగ్, ఈ–సంతకం, పిటిషన్ల ఈ–ఫైలింగ్‌లను సులభతరమవుతాయన్నారు. ఈ–ములాఖత్ అపాయింట్‌మెంట్ ద్వారా జైలులో ఉన్న బంధువులను కలవడానికి సహాయపడుతుందని తెలిపారు. ఈ–కోర్టు సేవల ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్న అన్ని ఇతర సేవల గురించిన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. న్యాయవాదులు పొత్తూరి అనిల్‌కుమార్, గుండా రవి, కిశోర్‌రావు, బొడ్డు ప్రశాంత్, నర్సింగరావు, గొంటి శంకర్, గుజ్జ మనోహర్, జెట్టి శేఖర్, జంగం అంజయ్య, అనిల్, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. వేములవాడలోని వాసవీ నిత్యాన్నదానసత్రంలో ఆదివారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, కోశాధికారి చీకోటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఇన్నోవేషన్స్ 101'లో హన్మాజిపేట విద్యార్థులు



మర్రిపల్లి అభిషేక్



జంకె శ్రీనిధి

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరికి ఇన్నోవేషన్స్ 101 పుస్తకంలో స్థానం లభించింది. 'తెలంగాణ ఇన్నోవేషన్ సెల్–ఇంటింటా ఇన్నోవేషన్'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ 101 నూతన ఆవిష్కరణలను గుర్తించి 'ఇన్నోవేషన్స్ 101' పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో హన్మాజీపేట హైస్కూల్ విద్యార్థులు మర్రిపల్లి అభిషేక్ ఆవిష్కరించిన ధాన్యం నింపే యంత్రం, జంకె శ్రీనిధి ఆవిష్కరించిన బోండా మేకింగ్ మిషన్‌లకు స్థానం లభించింది. విద్యార్థులను స్కూల్ హెచ్ఎం చిట్నేని శ్రీకాంత్‌రావు, గైడ్ టీచర్స్ కోరెం వెంకటేశం, మేడిపట్ల కిషన్ తదితరులు అభినందించారు.

50 ఏళ్లకు కలిసిన మిత్రులు



సిరిసిల్లకల్చరల్: ఒకటి కాదు రెండు కాదు.. యాభై ఏళ్ల విరామం తర్వాత మిత్రులు కలుసుకున్నారు. 1975–76 పదో తరగతి విద్యార్థులు సుదీర్ఘ విరామం తర్వాత సిరిసిల్ల శివారులోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. బాల్యస్నేహితులు ఒకే చోట చేరి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సుమారు 60 మంది ఒకే వేదికపై చేరారు. గాజుల ప్రతాప్, బూర దేవానందం, దాసరి నాగేశ్వర్, బోడ రవి, పత్తిపాక ప్రభాకర్, దావాల్జీ మధుకర్, అర్థం ప్రసాద్, కొడిమ్యాల వేణుగోపాల్, యెల్లె లక్ష్మీనారాయణ తదితరులు సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ కలయిక వాళ్ల జీవితాల్లో మధురమైన ఘట్టంగా మిగిలిపోయింది.

జాగ్రత్తలతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

- ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు

సిరిసిల్ల: సైబర్ మోసగాళ్లలో అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకుని సురక్షితమైన లావాదేవీలు చేయాలని సిరిసిల్ల ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం బ్యాంకింగ్ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు మాట్లాడుతూ ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీల్లో పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలని, బహిర్గతం చేయొద్దన్నారు. డెబిట్, క్రెడిట్‌కార్డుల వినియోగంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కేవైసీ కోసం బ్యాంకు అధికారులు ఫోన్‌లు చేయరని, బ్యాంకుకు వచ్చినప్పుడే సమాచారం కోరుతారని వివరించారు. గాంధీచౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారి యు.శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.





డివైడర్ కూల్చి.. రిపేర్ మరిచి

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణాన్ని వరదగండ్లు వదలడం లేదు. 2022 జూలైలో భారీ వర్షాలు కురిసి వరదలు రావడంతో సిరిసిల్ల నుంచి కలెక్టరేట్ వెళ్లే రోడ్డు డివైడర్‌ను కూల్చి వరదనీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. చంద్రంపేట, రగుడు వద్ద డివైడర్లను కూల్చి గండ్లు పెట్టారు. ఆనాడు కూల్చిన డివైడర్లను ఇప్పటికీ మరమ్మతు చేయలేదు. మళ్లీ వరద వస్తే నీరు వెళ్లిపోయేలా ప్రణాళికలు సిద్ధం చేసి, కూల్చివేసిన డివైడర్లకు మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా సిరిసిల్ల మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష

- వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష ఉత్సాహంగా సాగింది. విద్యార్థులకు వారివారి కేటగిరీలవారీగా పరీక్షలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు స్పెల్‌బీ, 11 గంటల నుంచి 12 వరకు మ్యాథ్స్‌బీ పరీక్షను నిర్వహించారు. కేటగిరి 1లో భాగంగా 1, 2 తరగతుల విద్యార్థులకు, 2వ కేటగిరిలో 3, 4 విద్యార్థులకు, 3వ కేటగిరిలో 5, 6, 7, 4వ కేటగిరి లో 8, 9, 10 విద్యార్థులకు నిర్వహించారు. లెవల్-2లో అర్హత సాధించిన విద్యార్థులను హైదరాబాద్‌లో జరిగే లెవల్-3 పరీక్షలకు నిర్వాహకులు ఎంపిక చేయనున్నారు.



అల్ఫోర్స్ కళాశాలలో మ్యాథ్స్ స్పెల్‌బీలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న సాక్షి స్పెల్‌బీ

ఇంగ్లిష్, మ్యాథ్స్‌ను విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకుంటారని విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తోంది సాక్షి స్పెల్‌బీ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సాక్షి స్పెల్‌బీ పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. స్పెల్‌బీతో ఆరోగ్యవంతమైన పోటీ విద్యార్థుల మధ్య ఏర్పడుతోందన్నారు. ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి లెవల్-1లో సెలెక్ట్ అయిన సుమారు 160 మంది విద్యార్థులు హాజరైనట్లు సాక్షి కరీంనగర్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఏడీవీటీ డిప్యూటీ మేనేజర్ ఊరగొండ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది వేముల శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షి స్పెల్‌బీకి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వైఫై, అసోసియేట్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి.

కొత్త పదాలు నేర్చుకుంటా



స్పెల్‌బీ లెవల్-2 పరీక్ష రాశా. లెవల్-1 కంటే లెవల్-2లో న్యూ వర్డ్స్ నేర్చుకున్నా. చాలా కొత్త పదాలున్నాయి. బుక్స్‌లో లేని పదాలు కూడా ఉన్నాయి. అవి ఏమిటో తెలుసుకున్నా. జోనల్ 3 రౌండుకు కూడా సెలెక్టవుతా. ఇంకా కొత్తకొత్త పదాలు నేర్చుకుంటా.

– ఆదిత్య, చాక్లెట్ హైస్కూల్

ఇంగ్లిష్‌పై పట్టు సాధించా



స్పెల్‌బీతో ఇంగ్లిష్‌పై పట్టు సాధించా. స్పెల్లింగ్స్ కూడా చాలావరకు నేర్చుకున్న. సెకండ్ రౌండ్ బాగా రాశా. జోనల్ ఫైనల్ రౌండ్‌కు కూడా అర్హత సాధిస్తా. ఇంగ్లిష్ పదాలు మరిన్ని నేర్చుకోవాలనిపిస్తోంది. స్పెల్‌బీ పరీక్ష బాగుంది. ఇంగ్లిష్‌లో కొత్తకొత్త పదాలు తెలిశాయి.

– అనన్యశ్రీ, శ్రీప్రగతి హైస్కూల్

పోటీ పరీక్షలకు ఉపయోగం



సాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలు రాసేవారికి నాలెడ్జ్ ఇంప్రూవ్ అవుతుంది. పోటీ పరీక్షలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆంగ్లంలో కొత్త పదాలను తెలుసుకోవడం, గణితంలో కొత్త ఫార్ములాలను తెలుసుకునే అవకాశం ఈ పరీక్షలతో సాధ్యమైంది.

– శివసాయిరెడ్డి, అల్ఫోర్స్ ఈటెక్నో హైస్కూల్

గణితంలో పట్టు సాధిస్తా



మ్యాథ్స్‌బీ లెవల్-2 పరీక్ష రాశా. న్యూ ఫార్ములాలు చాలా నేర్చుకున్నా. చాలా కొత్త పదాలున్నాయి. బుక్స్‌లో లేని ఫార్ములాలు కూడా ఉన్నాయి. అవి ఏమిటో తెలుసుకున్నా. జోనల్ రౌండుకు కూడా సెలెక్టవుతా. గణితంలో బాగా పట్టు సాధించాలని ఉంది.

– విష్మారెడ్డి, సెయింట్ జార్జ్ హైస్కూల్

స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ బాగుంది



సాక్షి మీడియా ఆధ్వరంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు చాలా బాగున్నాయి. ఇలాంటి పరీక్షలకు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. కొత్త పదాలు, కొత్త ఫార్ములాలు తెలుసుకోవచ్చు. టెక్స్ట్ బుక్‌లో లేని ఎన్నో పదాలు, ఫార్ములాలు ఇందులో ఉన్నాయి.

– ఇఫ్రా ఫాతిమా, అక్షర ఇంటర్నేషనల్ స్కూల్

క్లుప్తంగా

మాజీ ఎంపీ సతీమణి మృతి



శాంతమ్మ(ఫైల్)

కరీంనగర్/సిరిసిల్ల: పెద్దపల్లి మాజీ ఎంపీ, నేరెళ్ల మాజీ ఎమ్మెల్యే గొట్టె భూపతి సతీమణి శాంతమ్మ(76) ఆదివారం కరీంనగర్‌లో కన్నుమూశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గొట్టె భూపతి 1967, 1972లోనూ రెండుసార్లు ఇండిపెండెంట్‌గా నేరెళ్ల ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి ఎంపీగానూ రెండుసార్లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం గొట్టె భూపతి కుటుంబం కరీంనగర్‌లో ఉంటోంది. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న శాంతమ్మ ఆదివారం మృతిచెందారు. గొట్టె భూపతి, శాంతమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు. సుధీర్‌బాబు, సుమన్‌బాబు, సుజన్‌బాబు. సుధీర్‌బాబు ఐపీఎస్ ఆఫీసర్‌గా రాచకొండ పోలీస్ కమిషనర్‌గా పని చేస్తుండగా.. సుమన్‌బాబు 2001లో ఇల్లంతకుంట జెడ్పీటీసీగా గెలిచారు. ఆయన గుండెపోటుతో మరణించారు. సుజన్‌బాబు న్యాయవాది. శాంతమ్మ మరణ వార్త తెలియడంతో తంగళ్లపల్లిలోని కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలివెళ్లారు.

మెగా వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు చేయించుకుంటున్న సెస్ చైర్మన్

సిరిసిల్లటౌన్: జిల్లా వెలమ సంక్షేమ మండలి, హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హెల్త్‌క్యాంప్ విజయవంతమైంది. సెస్‌చైర్మన్, వెలమ సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు క్యాంప్‌ను ప్రారంభించారు. 2డీ, బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య సమస్యలకు వైద్యపరీక్షలు చేసి, పలు సూచనలు ఇచ్చారు. మండలి ప్రధాన కార్యదర్శి గుజ్జునేని వేణుగోపాల్‌రావు, మానేరు స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, వైద్యులు గౌడ శ్రీహరి, రమేశ్, నరేశ్, క్యాంప్ కోఆర్డినేటర్ సురేశ్, యశోద ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు పోటీల్లో రాణించాలి

- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి



క్రీడాకారులతో జిందం చక్రపాణి, నిర్వాహకులు

సిరిసిల్లటౌన్: జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆకాంక్షించారు. సిరిసిల్లలోని రైజింగ్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ అకాడమీ ఈస్టర్‌వేల్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ అండర్-19 టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు 25 జట్లు హాజరయ్యాయి. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ బసవవేణి లక్ష్మణ్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్, కృష్ణహరి, టోర్నీ నిర్వాహకులు ప్రేమ్, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల రాపల్లివాగు వంతెన వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఒకరిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కన్నెపల్లికి చెందిన పబ్బతి రాహుల్(20) అనే యువకుడు కొంతకాలంగా చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి తాగుతూ తనకు పరిచయం ఉన్నవారికి గంజాయి విక్రయిస్తున్నాడు. ఇతర పట్టణాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రాంతాల్లో గంజాయికి అలవాటు పడిన వారికి ఎక్కువ ధరకు అమ్ముతూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్నాడు. ఈక్రమంలో దుమాల వంతెన వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి రాహుల్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

లాడ్జీల్లో తనిఖీ



కరీంనగర్‌క్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో పలు లాడ్జీలను వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. లాడ్జీల్లో ఉన్నవారిని ఎక్కడ నుంచి వచ్చారు.. దేనికోసం వచ్చారనే విషయాలడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్‌టౌన్ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

జ్యోతినగర్: 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 కరాటే పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని టీవీ గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 కరాటే పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-17 బాలికల విభాగంలో 32 కిలోల పోటీల్లో సిరిచందన(మెదక్), 36 కిలోల పోటీల్లో రూపాశ్రీ(నిజామాబాద్), 40 కిలోల పోటీల్లో తనూశ్రీ(వరంగల్), 44 కిలోల పోటీల్లో శ్రీజ(కరీంనగర్), 48 కిలోల పోటీల్లో రక్షిత(కరీంనగర్), 56 కిలోల పోటీల్లో సిరిచందన(మహబూబ్‌నగర్), 60 కిలోల పోటీల్లో ఐశ్వర్య(వరంగల్), 64 కిలోల పోటీల్లో అనూష(ఆదిలాబాద్), 68 కిలోల పోటీల్లో శ్రీహరిణి(వరంగల్), 68 కిలోలు ఆపై విభాగంలో శ్రీహిత రాజ్(కరీంనగర్), బాలుర విభాగంలో 35 కిలోల పోటీల్లో సాత్విక్(కరీంనగర్), 40 కిలోల పోటీల్లో ఆదిత్య తేజ(కరీంనగర్), 45 కిలోల పోటీల్లో శ్రావణ్‌కుమార్(కరీంనగర్), 50 కిలోల పోటీల్లో అన్వేష్(వరంగల్), 54 కిలోల పోటీల్లో హర్షవర్ధన్(వరంగల్), 58 కిలోల పోటీల్లో సుభాష్‌రావు(నిజామాబాద్), 62 కిలోల పోటీల్లో శ్రీచరణ్(కరీంనగర్), 66 కిలోల పోటీల్లో ఎండీ ఫియాజొద్దీన్(రంగారెడ్డి), 70 కిలోల పోటీల్లో హర్షవర్ధన్(కరీంనగర్), 74 కిలోల పోటీల్లో హర్షతేజ(ఖమ్మం), 78 కిలోల పోటీల్లో షేక్ ఇస్మాయిల్(మెదక్), 82 కిలోల పోటీల్లో మల్లేశ్(మహబూబ్‌నగర్), 82 కిలోల పోటీల్లో షేక్ అబ్దుల్లా(మెదక్) జాతీయస్థాయి కరాటే అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, ఎంపిక కమిటీ సభ్యులు నారాయణమ్మ, శోభారాణి, ప్రకాశ్ జాబితా విడుదల చేశారు.

వర్ష జ్యువెలర్స్ ప్రారంభం



ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తదితరులు

కరీంనగర్: 23 ఏళ్ల అనుభవంతో నగరంలోని టవర్ సర్కిల్‌లో ఎలగందుల వీరేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షా జ్యువెల్లర్స్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ సంజయ్ ఆదివారం ప్రారంభించారు. కిలో వెండి కొనుగోలుపై 20గ్రాముల వెండి కాయిన్, 10 గ్రాముల బంగారు ఆభరణాలపై 10గ్రాముల వెండి ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశం కేవలం వారం రోజులు మాత్రమేనని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్, రామగుండం ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్, మేయర్ సునీల్‌రావు, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆరెపల్లి మోహన్, నాయకులు చల్ల హరిశంకర్, నిర్వాహకులు ఎలగందుల వీరేశం, పెద్ది వేణుగోపాల్, బొద్ద రాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతిఘటిద్దాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ
- 26న సిరిసిల్లలో నిరసన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ కోరారు. నవంబర్ 26న జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమ కరపత్రాలను ఆదివారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, తన్నీరు లక్ష్మీనారాయణ, జిందం కమలాకర్, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం.. జర భద్రం..

రోడ్లపై పోసిన ధాన్యం నిల్వలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని చెబుతున్నా కొంతమంది అలాగే పోస్తున్నారు. ప్రధాన రహదారిపై ఒకపక్క ధాన్యాన్ని పోయడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సిరిసిల్లక్రైం: చంద్రపేటకు చెందిన వేముల రాజశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పెద్దూరు నుంచి బైపాస్ రోడ్డుపై చంద్రంపేటకు వస్తుండగా.. పెద్ద బోనాల చిన్న బోనాల మధ్యలో బైపాస్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు.



పెగడపల్లి: ఆరవెల్లి నుంచి సుద్దపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పల వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆరవెల్లి గ్రామానికి చెందిన పాలోజి గంగాధర్ అనే వ్యక్తి మృతిచెందాడు.



పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యం దిగుబడులను ఆరబోసేందుకు అవసరమైనన్ని కల్లాలు అందుబాటులో లేక ప్రధాన రోడ్ల పక్కనే ఆరబోసుకుంటున్నారు. పెద్దపల్లి నుంచి ఎలిగేడుకు వెళ్లే దారిపై లోకపేట వద్ద ఇలా రైతులు ధాన్యాన్ని ఆరబోశారు.



రామగిరి(ముత్తారం): బేగంపేట క్రాస్ రోడ్ నుంచి ముత్తారం మండల కేంద్రానికి వెళ్లే దారి ఇది. ముత్తారం మండలం మైదంబండలో కొందరు రైతులు రహదారులపై ధాన్యాన్ని ఆరబోస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో రోడ్డు మీదే రైతులు ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం సరిపోక కొందరు రైతులు రోడ్డునాశ్రయిస్తున్నారు.



జమ్మికుంట: జమ్మికుంట, వీణవంక రోడ్డులో జగ్గయ్యపల్లి గ్రామంలో రోడ్డుపై ధాన్యం కుప్పలు పోయడంతో వాహనదారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. డబుల్ రోడ్డులో ఒకపక్క రోడ్డును ధాన్యం ఆరబెట్టేందుకు ఆక్రమించారు.



సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చిన తరువాత తేమ శాతం వచ్చేదాకా ఆరబెట్టాల్సి ఉంటుంది. ధాన్యం పోయదానికి స్థలం లేక రోడ్ల వెంట పోయదంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



నిత్యశ్రీ(ఫైల్)


జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో అనారోగ్యంతో ఓ విద్యార్థి మృతిచెందింది. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి తెలిపారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లికి చెందిన రవి–ఇందిర దంపతులు పట్టణంలోని కేశవపూర్‌కు ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు నిత్యశ్రీ(15)ని పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో చేర్పించారు. నిత్యశ్రీ 10వ తరగతి చదువుతోంది. ఈనెల 17న విద్యార్థిని అస్వస్థతకు గురికాగా.. తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి హాస్టల్‌లో చేర్పించారు. తర్వాత విద్యార్థిని పరిస్థితి విషమంగా మారగా.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయురాలు, ఏఎన్‌ఎంలు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈనెల 21న తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. నిత్యశ్రీని హన్మకొండ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కూతురు మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు కారణమని తండ్రి రవి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు. పాఠశాల ఆవరణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

డీఈవో విచారణ

డీఈవో జనార్దన్‌రావు పాఠశాలలో ఆదివారం సాయంత్రం విచారణ చేపట్టారు. విద్యార్థి మృతి విషయాన్ని గోప్యత పాటించి విచారణ జరిపారనే ఆరోపణలున్నాయి. వివరాలు తెలుసుకునేందుకు డీఈవోను ఫోన్ ద్వారా సంప్రదించగా.. అందుబాటులోకి రాలేదు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సమాచారం.

మాలలు సంఘటితం కావాలి

- మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఏబీసీడీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో మాలలు సంఘటిత పోరాటాలు చేయాలని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ కోరారు. డిసెంబర్ 1న 'హలోమాల.. చలో హైదరాబాద్' సింహగర్జన వాల్‌పోస్టర్లను ఆదివారం ఎల్లారెడ్డిపేటలో ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా చేపట్టిన సింహగర్జన సభకు భారీగా తరలిరావాలని కోరారు. నాలుక సత్యం, ప్రసాద్, సందీప్, లక్ష్మణ్, గడ్డం జితేందర్, కొత్త మల్లయ్య, బుర్క బాబు, మధు పాల్గొన్నారు.

చందుర్తి ఏఎస్సై ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్



బాపు, ఏఎస్సై

చందుర్తి(వేములవాడ): కేసు నమోదులో జాప్యం చేశారనే ఆరోపణల నేపథ్యంలో చందుర్తి ఏఎస్సై, ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో బాపును శనివారం రాత్రి ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్ చేశారు. చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన అంజయ్యకు మండలకేంద్రానికి చెందిన శేఖర్ రూ.50వేలు అప్పుగా ఇచ్చాడు. అంజయ్య నాలుగేళ్లు గడుస్తున్నా బాకీ చెల్లించకపోవడంతో అతని ట్రాక్టర్‌ను శేఖర్ తీసుకెళ్లాడు. తన ట్రాక్టర్ ఇప్పించాలని బాధితుడు అంజయ్య పోలీసులను నాలుగు రోజుల క్రితం ఆశ్రయించాడు. కేసు నమోదు చేయకుండా ఏఎస్సై జాప్యం చేస్తుండడంతో బాధితుడు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో ఏఎస్సై బాపును ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్డ్ చేశారు.

హరహర.. శివశివ..







వేములవాడ: కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు ఆదివారం లక్ష మంది భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు రాజన్నకు కోడె మొక్కులు, నిలువెత్తు బెల్లం పంపిణీ, కల్యాణకట్టలో తలనీలాలు, కళాభవన్‌లో సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమ పూజ మొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీల కోసం ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శనాలను భక్తులు వాడుకున్నారు. కార్తీక మాసం కొనసాగుతుండటంతో మహిళలు, సుహాసినులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల ద్వారా రూ.60లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. బద్ది పోచమ్మ, నగరేశ్వర, భీమేశ్వరాలయాలను సందర్శించారు.